


# ఏలూరు

- బచ్చోటి శ్రీధర రావు



విజయవాడ నుంచి ఏలూరుకి టాక్సీ జోరుగా పోతోంది. చాలా చిన్న ప్రయాణమే. కానీ చాలా కాలం తరువాత, నిజానికి కొన్ని యేళ్ళ తరువాత మళ్ళీ ఏలూరు వెడుతున్నాము. పుట్టి పెరిగిన ఊరుని తిరిగి చూడబోతున్న ఉత్సాహం, ఉద్వేగం మనసులో నిండిపోయాయి. హనుమాన్ జంక్షన్, నూజివీడు దాటిపోయాయి. ఇంక రాబోయేది వట్లూరు. వట్లూరు అనగానే గుర్తు వచ్చేది వట్లూరు దగ్గర రైల్వే గేటు మూస్తే రెండు వైపులా గ్రాండు ట్రంకు రోడ్డు మీద దూరప్రయాణాలు చేసే బస్సులూ కా ర్లూ అన్నీ ఆగిపోవడం, రైలు వెళ్ళగానే ఆగిన వాహనాలన్నీ మళ్ళీ నిదానంగా బయలుదేరి శరవేగాన్ని పుంజుకోవడం. అది గుర్తు వచ్చి ఎప్పటిలాగే గేటు వేస్తే ఆగి రైలు వెళ్ళే వరకూ వేచి ఉండాలి అనుకుంటున్నాను. కానీ ఇంతలో అనుకోకుండా టాక్సీ గేటు దాటే బదులు కుడివైపు ఇంకొక క్రొత్త రోడ్డులోకి మళ్ళి కృష్ణా కాలువ ప్రక్కగా వేగంగా వెళ్ళిపోతోంది. ఇదేమిటి ఈ రోడ్డు ఎక్కడనుంచి వచ్చింది అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తే బైపాస్ రోడ్డు కొత్తగా కట్టారని డ్రైవరు చెప్పాడు. ఇది బావుందనుకున్నాను.

టాక్సీ అలా రామకృష్ణపురం దాటి బ్రిడ్జి దాటి కాలువ అవతలి వైపుగా అగ్రహారం వైపు వెడుతోంది. అంతా తెలిసిన ప్రాంతమే. ఎలా వెళ్ళాలో డ్రైవరుకు చెప్పాలని చిన్నవంతెన తరువాత రోడ్డుకి ఇరుప్రక్కలా పెద్ద వృక్షాలూ వాటి చుట్టూ ఆంజనేయస్వామి యింకా యితర దేవుళ్ళ విగ్రహాలూ ఉన్న చోట కుడి వైపు తిరగమని చెప్పడం కోసం చూస్తున్నాను. ఏదీ? చిన్నవంతెన వెనక్కు వెళ్ళింది కానీ వృక్షాలూ లేవు, దేవుళ్ళ విగ్రహాలూ లేవు. వృక్షాల నీడా, దేవుళ్ళ రక్షా కోల్పోయి బోసిపోయిన రోడ్డు వెనక్కు వెళ్ళి పోయింది.

చిన్నప్పుడు పరీక్షలు పాసయితే అగ్రహారం ఆంజనేయస్వామికి కొబ్బరికాయ కొట్టడం గుర్తుంది. అలాగే శంకర మఠం, జనార్దనస్వామి ఆలయం, జలాపహారేశ్వరస్వామి ఆలయం, అగ్రహారంలో శివాలయం, రామచంద్ర రావు పేట లో ప్రతి యేడాదీ జరిగే వేంకటేశ్వర స్వామి సప్తాహాలు,


అగ్రహారంలో శివాలయం

పేరయ్య కోనేరులో రామకోటి ఉత్సవాలూ అన్నీ గుర్తు ఉన్నాయి. వేంకటేశ్వరస్వామి సప్తాహాలు జరిగే స్థలం ఒకప్పుడు


బ్రహ్మోత్సవాలు జరిగేచోటు

పిల్లలు ఆడుకునే పెద్ద ఆటస్థలం. కొన్ని సంవత్సరాల క్రితం అక్కడ పెద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. అక్కడ ఈ మధ్య బ్రహ్మోత్సవాలు కూడా ఘనంగా జరుగుతున్నాయి. పేరయ్య కోనేరులో ఎన్నో సభలు కూడా జరుగుతూ ఉండేవి. ఒకసారి ప్రసిద్ధ చలనచిత్ర నటులు యస్వీ రంగారావు (ఆయనది ఏలూరే) వచ్చినప్పుడు పేరయ్య కోనేరులో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. ఒకాయన తన ఉపన్యాసంలో "రౌడీ రంగా!" అని సంబోధించడమే కాక "నువ్వు ఏలూరు రోడ్లలో రౌడీగా తిరగడం మాకు గుర్తుంది " అని అసందర్భంగా మాట్లాడడం జరిగింది. దానికి యస్వీ రంగారావు "ఏలూరు వీధుల్లో రౌడీగా వారు తిరిగారేమో గానీ నేను తిరగలేదు " అని తనదైన రీతిలో, శైలిలో హుందాగా సమాధానం చెప్పారు. ఆ రోజుల్లో అంతమంది అభిమానులూ ఆ ముందటి వక్తని ఏమీ చేయలేదు. పేరయ్య కోనేరుకి దగ్గరలోనే వై.యం.హెచ్.ఎ. హాలు ఉంది. ఇది ఒకప్పుడు ఏలూరికి కళాక్షేత్రం వంటిది. అక్కడ ఎన్నో నాటకాలకీ, సభలకీ వెళ్ళే వాళ్ళం. ఇప్పుడు కూడా అక్కడ సభలూ సమావేశాలూ జరుగుతూనే ఉన్నాయి.

వట్లూరు గేటుని తప్పించుకోవడానికి కట్టిన బైపాస్ రోడ్డు గురించి చెప్పాను కాబట్టి ఇంకొక విషయం చెప్పాలి. ఏలూరు ప్రజల జీవితానికీ రైల్వే గేట్లకీ చాలా అవినాభావ సంబంధం ఉంది, అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ కూడానేమో. మద్రాస్ (అదే, చెన్నై) హౌరా లైను సరిగ్గా ఏలూరు మధ్యనుంచి వెడుతుంది. అందువల్ల ఏలూరులో ఒకటి కాదు రెండు కాదు నాలుగు రైల్వే గేట్లు ఉండేవి. ఇప్పుడు మూడు. ఓవర్ బ్రిడ్జి వేయడం వలన రామకృష్ణపురం రైల్వే గేటు ఏనాడో మూత పడింది. కానీ మిగతా గేట్లు నిరంతరమూ ఏలూరు నగరాన్ని రెండు భాగాలుగా విభజించి రెండు వైపులకీ రాకపోకలని నిర్దాక్షిణ్యంగా నిలిపి వేస్తూ ఉంటాయి.

నా చిన్నప్పుడు ఏలూరులో ఏడు సినిమా హాళ్ళు మాత్రమే ఉండేవి. రైల్వేలైనుకి ఇవతల మూడు, అవతల నాలుగు. ఇవతల అంటే రామచంద్రరావు పేట వైపు అన్న మాట. దానిని ఇవతల అని ఎందు కంటున్నానంటే మాది రామచంద్రరావు పేట కాబట్టి! అప్పట్లో వచ్చే సినిమాల సంఖ్యకి ఆ ఏడు థియేటర్లే ఎక్కువ. నాకు సరిగ్గా తెలియదు కానీ కేసరీ టాకీసు ఏలూరు లో మొట్టమొదటి సినిమా హాలు అని ఎవరో చెప్పడం గుర్తుంది. రామచంద్రరావు పేట వైపు




మాత్రం అతిపురాతనమైన సినిమా హాలు షా మహల్. తరువాత అదే విశ్వశాంతి థియేటర్ అయి యిప్పటికీ బాగా నడుస్తోంది. ఇప్పుడు వీధికొకటి చొప్పున కావలసినన్ని సినిమాహాళ్ళు ఉన్నాయనుకోండి. కొత్తగా రిలీజయిన దయితే కేవలం ఒక్క సినిమాయే ఏడు హాళ్ళలో ప్రదర్శింపబడుతూ కూడా ఉంటుంది.

ఏలూరు తివాసీ పరిశ్రమకి మంచి పేరుంది. ఏలూరులో తయారయిన తివాసీలకి ఇప్పుడు కూడా అనేకచోట్ల మంచి గిరాకీ ఉంది. ఎప్పుడో పర్షియనులు ఏలూరికి వచ్చి యీ తివాసీ పరిశ్రమ మొదలుపెట్టారని చెబుతారు.

ఏలూరు చారిత్రక నామధేయం హేలాపురి. ఒకానొకప్పుడు, అంటే క్రీ.శ.700-1200 కాలంలో తూర్పు చాళుక్యులు పరిపాలించిన వేంగీరాజ్యంలో భాగం. నేను చూడలేదు గానీ అప్పుడు ప్రాబల్యంలో ఉన్న బౌద్ధ మతచిహ్నాలు ఏలూరుకి సమీపంలో ఉన్న గుంటుపల్లిలో చాలా ఉన్నాయట.

### ఒక దుర్ఘటన

నా చిన్నప్పుడు పవరు పేట గేటు దగ్గర ఒక దుర్ఘటన జరిగింది. ఆ రోజుల్లో ఆంధ్ర, తెలంగాణ విడిపోవాలని తీవ్రమైన ఆందోళన జరుగుతోంది. ఒకరోజు ప్రజలు చాలా పెద్ద సంఖ్యలో పవరు పేట దగ్గరకి వెళ్ళి పెద్ద యెత్తున

ఆందోళనకు దిగారు. మేము దూరం నుంచి చూస్తున్నాము. పోలీసులు లాఠీ ఛార్జి చేసారు. కొంతమందిని పోలీసులు దగ్గరలో ఉన్న రామచంద్ర రావు పేట పోస్ట్ ఆఫీసు కాంపౌండులో నిర్బంధించారు. ఆ కాంపౌండులోంచి ఒక స్టూడెంటు పారిపోవడానికి ప్రయత్నించడం పోలీసులు అతనిని



రైల్వే స్టేషను

కొట్టి మళ్ళా లోపల వేయడం మేము దూరం నుంచి చూశాము. ఇంతలో పోలీసులు కాల్పులు ప్రారంభించారు. మేము పారిపోయాము. సద్దుమణిగిన తరువాత మేము కొన్ని శవాలను కళ్ళారా చూశాము. గేటుకి అవతల ఇంకా కొంతమంది పోయారని విన్నాము. రెండు వైపులా రాకపోకలు బంద్. మర్నాడు పేపర్లో మాత్రం "ఒక వ్యక్తి మృతి" అని వ్రాశారు.

**సాహితీపరులు**

నాకు చిన్నప్పటినుంచీ పద్యాలు వ్రాయడం అలవాటు ఉంది. అది ఇప్పటికీ నన్ను విడవలేదు. ఆ అలవాటు వల్ల కాలేజిలో చేరే టైముకి ఏలూరులో ఎందరో పేరెన్నిక గల కవులతో, రచయితలతో నాకు పరిచయం ఏర్పడింది. వారిలో 'మొక్కజొన్న తోటలో' పాటతో ప్రసిద్ధులైన కొనకళ్ళ వెంకటరత్నం గారు, సంప్రదాయకవులు గరికపాటి మల్లావధాని గారు, సామవేదం జానకీరామ శర్మ గారు, ముత్తేవి లక్ష్మణ యతీంద్రులు (అప్పటికి వారింకా లక్ష్మణ దాసుగానే వ్యవహరింప బడుతూ ఉండే వారు), నవలారచయితలు కొండముది శ్రీరామచంద్ర మూర్తి గారు, పోల్నాప్రగడ సత్యనారాయణ గారు మొదలైన వారు ఉన్నారు. వీరితో కలిసి కవిసమ్మేళనాలలో పాల్గొనగలగడం నా అదృష్టం. నేను ఈ కవిసమ్మేళనాలలో ఛందోబద్ధమైన పద్యాలు, కవితలు చదువుతూ ఉండేవాడిని. వీరే కాక ఏలూరి వారు ఇంకా యెందరో లబ్ధప్రతిష్ఠులైన వారు ఉన్నారు. ప్రవాసాంధ్రులలో అందరికీ సుపరిచితమైన పేరు వెల్చేరు నారాయణ రావు గారిది. వీరు కూడా ఏలూరు వారే. నెలకొకసారి సాహిత్యాభిమానులం కొందరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కలుస్తూ ఉండేవాళ్ళం. ఆ చిన్న సైజు కలయికలకి కొనకళ్ళ వెంకటరత్నం, గరికపాటి మల్లావధానిగార్లు తప్పకుండా వస్తూ ఉండే వారు. సామవేదం జానకీ రామశర్మగారు "సాహితి" అనే సాహిత్యపత్రికను చాలాకాలం నడిపి అప్పుడే నిలిపివేశారు. ఆ పత్రిక ఇంచుమించు "భారతి" మాసపత్రికలా ఉండేది. ఇప్పుడు సాహితీ లేదు, భారతీ లేదు. ఆయన సెయింట్ థెరిసాస్ కాలేజ్ లో అధ్యక్షాంధ్రోపన్యాసకులుగా ఉండి రిటైర్ అయ్యారు. ఆ సందర్భంలో వారి షష్టిపూర్తి ఉత్సవం సెయింట్ థెరిసాస్ కాలేజ్ ఆవరణలోనే జరిగింది. దానికి ఆంధ్రదేశంలోని వేర్వేరు ప్రదేశాలనుంచి హేమాహేమీల వంటి సాహితీవేత్తలెందరో వచ్చారు. అది చాలా ఘనంగా ఒక ఉత్సవంలాగా జరిగింది. ముత్తేవి లక్ష్మణదాసుగారు "ముముక్షువు" అనే ఆధ్యాత్మిక మాస పత్రికను, "సురుచి" అనే పాప్యులర్ వారపత్రికను నడిపే వారు. ఈ రెంటిలోనూ నేను వ్రాసిన పద్యాలు, కవితలు చాలా ప్రచురింపబడ్డాయి.

సాహిత్యరంగం లోనే కాక చిత్రకళలో కూడ అత్యంత ఖ్యాతినార్జించిన మొక్కపాటి కృష్ణమూర్తి గారు కూడా ఏలూరుకు చెందిన వారే. వీరు నాకు సన్నిహిత బంధువు కావడం కూడా నాకు గర్వకారణం. వీరి గురించి ఈ మధ్యనే రచన మాసపత్రిక నవంబరు 2005 సంచిక లో కస్తూరి భాస్కర రావు గారు ఒక వ్యాసం వ్రాశారు. ఈ సంచిక ముఖచిత్రం కూడా మొక్కపాటి కృష్ణమూర్తి గారు వేసినదే

**ఎలిమెంటరీ స్కూలు**

నేను కస్తూరీ ప్రాథమిక పాఠశాల అనే ఎలిమెంటరీ స్కూలులో ఐదవ తరగతి వరకూ చదువుకున్నాను. స్కూలు

వెనక చాలా పెద్ద తోట ఉండేది. వారానికి ఒకసారి మా క్లాసు వాళ్ళం అందరం తోటపని చేసే వాళ్ళం. ఆ తోట ఎప్పుడూ పచ్చని మొక్కలతో రంగురంగుల పూలతో కళకళలాడుతూ ఉండేది. ఆ తోట వెనకాల స్కూలు కాంపౌండులోనే కాస్త విశాలమైన ఖాళీ స్థలం ఉండేది. గేమ్స్‌క్లాసులో అక్కడ పిల్లలందరినీ ఆటలాడించేవారు. క్లాసులలో కూర్చునేందుకు మాకు మంచి బెంచీలే ఉండేవి. అయితే ఒకటవ తరగతినుంచీ ఐదవ తరగతి వరకూ అంచెలంచెలుగా ఆ బెంచీల క్వాలిటీ కూడా పెరిగేది. వారానికొకసారి అసెంబ్లీ అని జరిగేది. కొన్ని తరగతుల మధ్య పార్టిషన్ లు తీసేస్తే అది ఒక పెద్ద హాలు అయ్యేది. అక్కడ స్కూలులో ఉన్న పిల్లలందరూ సమావేశమైతే కొంతమంది పిల్లలు పాటలూ, పద్యాలూ వగైరా పాడే వారు. నేను "జయత్వదభ్రవిభ్రమత్" పూర్తిగా పాడడం (సీతారామ కళ్యాణం సినిమాలో ఉన్నంతవరకూ) గుర్తుంది.

ఒక క్లాసులో మాకు తకిలీతో (spindle) దారం వడకడం నేర్పే వారు. ఈ తకిలీలలో చాలా రకాలు ఉన్నాయి. మేము లోహంతో చేసిన తకిలీ వాడే వాళ్ళం. పొడుగు కాడ ఉన్న బొంగరంలా ఉంటుంది. కాడ చివర చిన్న కొక్కెం కూడా ఉంటుంది. ప్రారంభంలో దూదినుంచి దారాన్ని చేయడానికి ఈ కొక్కెం ఉపయోగిస్తుంది. పత్తినుంచి గింజలు వేరు చేసి తకిలీని బొంగరంలా తిప్పుతూ దూదినుంచి దారం చేయడం తమాషాగా ఉండేది. స్కూలులో అందరూ ఎవరికి వారే తకిలీ కొనుక్కోవాలి. తకిలీ కోసమని నేను ఒక టీచరుకి డబ్బిస్తే ఆయన ఆ డబ్బుని వాడేసుకుని ఎంత కాలానికీ నాకు తకిలీ కానీ, డబ్బు కానీ తిరిగి ఇవ్వలేకపోవడం గుర్తుంది. మనకి చదువుచెప్పే ఉపాధ్యాయులని ఆర్థికంగా అంత క్రింది స్థితిలో ఉంచడం హృదయవిదారకమైన విషయం.

### హైస్కూలు

నేను శ్రీమతి ఈదర సుబ్బమ్మాదేవి మునిసిపల్ హైస్కూలులో చదువుకున్నాను. ఎలిమెంటరీ స్కూలులో ఎప్పుడూ నేలమీద కూర్చోలేదు కానీ హైస్కూలులో మాత్రం ఆరు, ఏడు తరగతులలో నేలమీదే కూర్చునే వాళ్ళం. ఏడవ తరగతిలో ఉండగా కవితలు వ్రాయడం మొదలు పెట్టాను. తెలుగు వ్యాకరణం పుస్తకంలో చందస్సు ప్రకరణం చూసి ఇదేదో బావుందనుకుని పద్యాలు కూడా వ్రాయడం మొదలు పెట్టాను. నేను ఏడవ తరగతిలో ఉండగానే సీనియర్ విద్యార్థి ఒకతను (పదవ తరగతి అనుకుంటాను, పేరు గుర్తు లేదు) సినిమా పాటల ట్యూన్స్‌తో దేశభక్తి గీతాలను రచించడమే కాక వాటిని ఒక చిన్న పుస్తకంగా ప్రచురించాడు కూడాను. ఆ స్ఫూర్తి తోనే అనుకుంటాను నేను కూడా పదవ తరగతిలో పథ్వీరాజు సంయుక్తల కథని పద్యాల రూపంలో వ్రాసి ఒక



సుబ్బమ్మాదేవి మునిసిపల్ హైస్కూలు

చిన్న పుస్తకంగా ప్రచురించాను.

హై స్కూలులో ఉండగా ఆగస్టు 15 కి ముందు రోజు రాత్రి క్లాసు రూములన్నీ రంగు కాగితాలతో అలంకరించే వాళ్ళం. బాగా అలంకరించిన క్లాసులకి ప్రైజులు ఇచ్చే వారు. ఒకసారి నేను, ఇంకొక మిత్రుడు మాత్రమే కలిసి మా క్లాసు రూముని తెల్లవార్లూ అలంకరించాము. ఆ ఏడాది మా క్లాసుకి మొదటి బహుమతి వచ్చింది. పదవ తరగతిలో ఉండగా అనుకుంటాను రాత్రి 11 గంటలప్పుడు, అందరూ వాళ్ళ వాళ్ళ క్లాసులని అలంకరిస్తున్న సమయంలో కొంతమంది కాలేజి స్టూడెంట్లు వచ్చి కాలేజిలో రంగు కాగితాలు అయిపోయాయని, మా దగ్గర ఉన్న కాగితాలు అన్నీ ఇచ్చెయ్యకపోతే ఇంకా కాలేజి స్టూడెంట్లు వచ్చి మా డెకరేషన్స్ అన్నీ పాడిచేసేస్తారనీ బెదిరించారు. మేము ఏదో వెర్రి ధైర్యంతో వాళ్ళతో వాదించి ఇవ్వమని చెప్పేశాము. వాళ్ళు వెళ్ళిన తరువాత ఇంకా ఎక్కువమంది వస్తారేమో అని భయపడ్డాము కానీ ఎవరూ రాలేదు.

హైస్కూలులో ఉండగా నేను మొట్టమొదటసారిగా "త్యాగభూమి" అనే నాటికలో నటించి ఉత్తమనటుడిగా బహుమతినందుకున్నాను. రచయిత ఎవరో గుర్తులేదు కానీ ఆ

నాటిక "ఆంధ్రప్రదేశ్" అనే రాష్ట్రప్రభుత్వ పత్రికలో అచ్చయిందని గుర్తుంది.

**కాలేజి చదువు**

నా కాలేజి చదువు కూడా ఏలూరులోనే సర్ సి.ఆర్. రెడ్డి కాలేజి లో జరిగింది. హై స్కూలులో కంటే కాలేజిలోనే ఎక్కువ నాటికలలో వెయ్యడం జరిగింది. పద్యాలూ రాస్తూనే ఉన్నాను. ఇంగ్లీషు అన్నా తెలుగు అన్నా కూడా చాలా అభిరుచి ఉండేది. తెలుగు లెక్చరరు గారు తెలుగు ఎం.ఎ. చెయ్యమంటే, ఇంగ్లీషు లెక్చరరు గారు ఇంగ్లీషు ఎం.ఎ. చెయ్యమనే వారు. అటూ కాకుండా ఇటూ కాకుండా బయోకెమిస్ట్రీలో పడి భాషకి రెండవ ప్రాధాన్యత ఇయ్యవలసి వచ్చింది.

కాలేజిలో ఉండగా ఎగ్జామ్స్‌కి పేపర్లో రిజల్ట్స్ వచ్చినప్పుడు అదో హడావిడి. మర్నాడు పేపర్లో రిజల్ట్స్ వస్తాయనగా ముందురోజు రాత్రి స్టూడెంట్స్ అందరూ జి.యన్.టి. రోడ్డు మీద విజయవాడ నుంచి వచ్చే బస్సులకోసం బస్ స్టాప్ దగ్గర చేరే వారు. ఎందుకంటే విజయవాడలో మరుసటి ఉదయం పేపరు ఈరోజు



సర్ సి.ఆర్. రెడ్డి కాలేజి

సాయంత్రమే వచ్చేది. విజయవాడ దగ్గరనుంచి వచ్చే వారెవరిదగ్గరైనా పేపరు ఉంటే తీసుకుని రిజల్ట్స్ చూసుకోవచ్చు కదా! అలా నేనూ ఒక సారి వెళ్ళాను. ఒక్కటే పేపరు దొరికింది. పేపరు దొరికిన అతను గుమిగూడిన వారి ధాటికి తట్టుకోలేక కొన్ని నంబర్లు చదవడం కొంత దూరం వెళ్ళిపోవడం చేస్తున్నాడు. ఆతని వెనకాలే మేమూ. అలా అలా అతను మోతే వారి మేడ దాకా వెళ్ళిపోయాడు. అక్కడిదాకా నేనూ వెళ్ళినా లాంగ్వేజెస్ లో నా నంబరు వినపడలేదు. క్లాస్ మేట్లు కొందరి నంబర్లు వినపడుతున్నాయి. చివరికి తెలిసింది నా నంబర్ కూడా ఉందని, అప్పటిదాకా అతను క్రింది తరగతి నంబర్లు మాత్రమే చదివాడని.

ఈ మోతే వారి మేడ ఏలూరులో ఒక ప్రత్యేకస్థలం. ఆ మేడలో నా చిన్నప్పుడు ప్రతి గంటకీ గట్టిగా గంటలు కొట్టే వారు. చాలా దూరం వినపడేవి.

కాలేజి చదువు పూర్తవగానే ఇంక ఏలూరుని విడిచిపెట్టవలసివచ్చింది. అప్పటినుంచీ ఏలూరికి శలవులకనో, శలవు పెట్టుకునో మాత్రమే వెళ్ళడం. కానీ వెళ్ళినప్పుడల్లా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు రావడమే కాక, వీధి వీధీ ఏ విధంగా మారిపోతోందో చూస్తుంటే ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది.

**కొసమెరుపు**

సాహిత్యాభిలాష పెంపొందాలంటే సజ్జన సాంగత్యం కావాలి. ఆది నాకు చిన్నతనంలో ఏలూరులో పుష్కలంగా లభించినా అక్కడితో ఆగిపోలేదనడానికి నిదర్శనం కిరణ్‌ప్రభ గారితో నా సాహచర్యం. ఇది విశాఖపట్నంలో ప్రారంభమై, అనుకోకుండా అదృశ్యమై, మళ్ళా అమెరికాలో ప్రత్యక్షమైంది. పాత జ్ఞాపకాలు నెమరువేసుకోవడానికి ఇంత చక్కని అవకాశాన్ని కలిగించిన కిరణ్‌ప్రభ గారికి కృతజ్ఞతలు. సుజనరంజని కోసం సిలికానాంధ్ర కోసం వారు చేస్తున్న నిరంతరకృషికి అభినందనలు.

ఫోటోలు సకాలంలో అందించి సహకరించినది

బచ్చోటి వెంకట రమణరావు

బచ్చోటి శ్రీధర రావు గారు  ఏలూరు విడిచిపెట్టిన తరువాత విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, బెంగుళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్  ఆఫ్ సైన్స్‌లో పి.హెచ్.డి. ముగించి, పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ తో అమెరికాకి రావడం, తరువాత మెల్లిగా అమెరికాలో స్థిరపడిపోవడం జరిగింది. తెలుగు సాహిత్యమన్నా, నాటికలలో నటించడమన్నా ఇంకా అభిమానమే. భార్య కనకదుర్గ, పిల్లలు సమీర, ప్రవీణ్ లతో కలిసి జర్మన్ టౌన్, మేరీలాండులో నివసిస్తున్నారు



పుట్టి పెరిగిన వూరు కన్న తల్లితో సమానం అంటారు. ప్రపంచంలో ఏ మూల వున్నా మన అమ్మని ఎలా మరచి పోలేమో, సొంత ఊరుని కూడా అలానే మరచిపోలేము. దూరం ఎక్కువయ్యే కొద్దీ అనుబంధం మరింత పెరిగినట్లు మన వూరుకి దూరంగా నివసిస్తున్న కొద్దీ మరింత గుర్తొస్తుంటుంది. మీ వూరంటే మీకెందుకంత ఇష్టమో తోటి పాఠకులతో పంచుకోండి. మీ వూళ్ళో చిన్నప్పుడు మీరు చేసిన చిలిపి పనులూ, అప్పటి నేస్తాలూ, ఆడుకున్న ఆటలూ, ఆటల్లో తగాదాలూ, పందాలూ, పండుగ రోజులూ, హైస్కూల్లో అల్లరి సంఘటనలూ..ఏమైనా వ్రాయండి. అప్పటి ఫోటోలు కూడా పంపిస్తే మీ వ్యాసం మరింత అందంగా వుంటుంది..ఈ విశాల ప్రపంచంలో ఇంకెక్కడో ఉన్న మీ వూరి నేస్తాలు మిమ్మల్ని మళ్ళీ పలకరిస్తారేమో చూడండి! మీవూరి జ్ఞా పకాలతో బాటు ప్రస్తుతం మీరేం చేస్తున్నారో, ఎక్కడున్నారో కూడా వ్రాయడం మరువకండి... !!